క్లుప్తంగా

దుర్గగుడి గ్రైండర్ సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానం విభాగానికి విజయవాడకు చెందిన భక్తుడు రూ.25 వేల విలువైన గ్రైండర్‌ను బుధవారం కానుకగా సమర్పించారు. విజయవాడకు చెందిన అడ్వకేట్ శ్రీనివాస్ బుధవారం అర్జున వీధిలోని అన్నదాన విభాగం సూపరిండెంటెంట్ హేమదుర్గాంబకు గ్రైండర్‌ను అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కలిప్పించి ప్రసాదాలను అందచేశారు.

అలరించిన భక్తి గీతాలాపన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం కళావేదికపై బుధవారం కడపకు చెందిన జ్ఞానద కల్చరల్ ట్రస్ట్‌కు చెందిన పలువురు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పి.హిమబిందు పలు కీర్తనలను ఆలపించగా, జగన్మోహిని మృదంగంపై, అభిరామ్ వయోలిన్‌పై భావజ్ఞ వాద్య సహకారం అందించారు. అమ్మవారి దర్శనానంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు భక్తి గీతాలను ఆలకించి మంత్ర ముగ్ధులయ్యారు. కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి భారీ జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి మోటారు వాహనాలు నడిపిన 16 మందికి విజయవాడ ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు బుధవారం జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఐదో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 16 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి రూ.15 వేల చొప్పున, 13 మందికి రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

రేపు శిఖర ప్రతిష్టామహోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని జై సంతోషిమాత ఆలయ ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్టామహోత్సవాల వాల్ పోస్టర్లను నిర్వాహకులు బుధవారం ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల తొమ్మిదో తేదీ ఉదయం 11 గంటలకు శిఖర ప్రతిష్టామహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు అర్చకులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట మహోత్సవానికి శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి, ప్రముఖ శ్రీకృష్ణ తత్వ ప్రచారకులు రాధా మనోహర్‌దాస్ స్వామీజీ తదితర స్వామీజీలు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మండ్రి నాగేశ్వరావు, ఎస్.మార్కండేయులు, డి.గుంటయ్య, చిన్ని లక్ష్మి, సత్యనారాయణ, సీహెచ్.వెంకటనరసమ్మ, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ధరల దందా

- స్టాళ్లలో యథేచ్ఛగా అధిక ధరలు వసూలు
- ఎమ్మార్పీని పట్టించుకోని నిర్వాహకులు
- నాసిరకం ఆహార ప్యాకెట్ల విక్రయాలు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే స్టేషన్‌లోని స్టాళ్లలో ఏ వస్తువు కొనాలన్నా ప్రయాణికులు భయపడుతున్నారు. అధిక శాతం స్టాళ్ల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులను గుల్లచేస్తున్నారు. రోజూ సుమారు 250 వరకు రైళ్లు విజయవాడ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తాయి. వాటిలో లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేషన్‌లో పది ప్లాట్‌ఫామ్‌లలో సుమారు 80 వరకు వివిధ క్యాటరింగ్ స్టాళ్లు ఉన్నాయి. వాటిలో ఎమ్మార్పీకే విక్రయాలు సాగించాలనే నిబంధన ఉంది. అయితే అధిక శాతం స్టాళ్లలో ఎమ్మార్పీ అమలు కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు అవకాశాన్ని అధిక ధరలు వసూలు చేస్తూ ప్రయాణికుల నుంచి నిత్యం రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అయితే వారి దందాకు అడ్డూ అదుపు ఉండదని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. స్టాళ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు అడపాదడపా కేసులు పెట్టి పెనాల్టీ విధించి తమ పని అయిపోయిందని అనిపించుకుంటున్నారు. దీంతో వ్యాపారులు యథేచ్ఛగా అధిక ధరల దందా కొనసాగిస్తున్నారు.

నిబంధనలకు పాతర

స్టాల్స్ ముందు ధరల పట్టిక, ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలనే నింబంధన ఉంది. అయితే రైల్వేస్టేషన్‌లో అవి ఎక్కడా కనిపించవు. కొన్ని దుకాణాల ముందు ధరలపట్టిక ఉన్నా అది కనిపించకుండా అడ్డుగా డస్ట్‌బిన్‌లు, ఫుడ్ ప్యాకెట్లను వేలాడదీస్తున్నారు. ముఖ్యమైన రైళ్లు ఎక్కువగా నిలిచే ఒకటి, ఆరు నంబర్ల ప్లాట్‌ఫామ్‌లో ధరల దందా ఎక్కువగా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. తయారీ, వినియోగించాల్సిన గడువు తేదీలు లేకుండానే నాసిరకం భోజనం, బిర్యానీ ప్యాకెట్లు, సమోసాలు, ఇతర ఆహార పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయి. వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్, బిస్కెట్లు, జ్యూస్, పాల ఉత్పత్తులు ఇతర తినుబండారాలు ఇలా ప్రతి వస్తువుపై ఐదు నుంచి పది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. కాఫీ, టీ, పాలులో సైతం ఉండాల్సిన పరిమాణం కంటే తక్కువగా ప్రయాణికులకు అంటగట్టి వ్యాపారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.



స్టాల్ వద్ద ఎమ్మార్పీ వివరాలు కనిపించకుండా వేలాడదీసిన ప్యాకెట్లు (సర్కిల్‌లో)

పెనాల్టీలంటే లెక్కేలేదు

రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేపట్టి అధిక ధరలు వసూలు చేసినా, నాసిరకం ఆహార పదార్థాలు విక్రయించినా గుర్తించి పెనాల్టీలు విధిస్తున్నారు. అనధికారికంగా ఆహార పదార్థాలు విక్రయించే వెండర్లకు సైతం జరిమానాలు విధిస్తున్నారు. అయినా స్టాళ్ల నిర్వాహకులు, అనధికార వెండర్లలో మార్పు రావటం లేదు. యథావిధిగా తమ పంథా కొనసాగిస్తున్నారు. కారణం వారికి వచ్చే అదనపు ఆదాయంతో పోల్చుకుంటే చెల్లించే పెనాల్టీ ఒక లెక్కే కాదంటూ తనిఖీ అధికారులు అటు వెళ్లగానే యథావిధిగా తమ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి పెనాల్టీలతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప వ్యాపారుల్లో మార్పు రాదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.



తయారీ తేదీ, గడువు లేకుండానే విక్రయిస్తున్న భోజనం ప్యాకెట్లు

అడిగితే చిల్లర తెచ్చుకోమంటున్నారు



రైల్వేస్టేషన్‌లో వాటర్, కూల్ డ్రింక్ బాటిళ్లు కొంటే వాటిపై ఉన్న ఎమ్మార్పీకంటే అదనంగా రూ.10 వసూలు చేశారు. అదేమని అడిగితే తగిన చిల్లర తెచ్చుకోవాలంటూ విసుక్కున్నారు. డబ్బులకు బదులుగా బిస్కెట్ ప్యాకెట్ చేతిలోపెట్టారు. అధికారులు నిరంతరం నిఘా ఉంచి ప్రయాణికులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– శ్రీనివాసరావు, ప్రయాణికుడు

ఇండోర్ స్టేడియం ప్రారంభం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి) పేర్కొన్నారు. క్రీడాకారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. 46వ డివిజన్ కేఎల్‌రావు పార్కులో రూ.కోటితో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే షటిల్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో స్టేడియాలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. మన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన స్టేడియాన్ని తన చేతుల మీదగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. షటిల్ క్రీడాలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇండోర్ స్టేడియం నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, కార్పొరేషన్ అధికారులు, బీజేపీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకులు నాగుల్‌మీరా, ఎంఎస్‌బేగ్, శివకుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు కొత్తపేట సీఐ బాధ్యతల స్వీకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.చిన్న కొండలరావు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహించిన టిప్పా గణేష్ ఏలూరు రేంజ్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిన్న కొండలరావు నియమితులయ్యారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో







జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజీ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. పలువురు అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు యువతులు చేనేత వస్త్రాలు ధరించి 'ఫ్యాషన్ షో' నిర్వహించి మెరిశారు. క్యాట్ వాక్‌లతో ఆహూతులను అలరించారు. కాలేజీలో చేనేత దినోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పటమట(విజయవాడతూర్పు): కృష్ణా నదికి వరద పోటెత్తిన నేపథ్యంలో నగరపాలక సంస్థ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలో ముంపునకు గురయ్యే పలు ప్రాంతాలను పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద జరుగుతున్న గ్రీన్ బెల్ట్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పూర్ణానందంపేటలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ సక్రమంగా జరగకపోవడాన్ని గమనించారు. పారిశుద్ధ్య కార్మికులు అలసత్వంగా ఉండకూదని సూచించారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో స్వాతంత్ర దినోత్సవానికి జరుగుతున్న పనులను పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి పాల్గొన్నారు.

బహుళ జాతి కంపెనీలను తరిమికొట్టండి

- కార్మిక, కర్షక సంఘాల జిల్లా సమన్వయ సమితి పిలుపు
- రేపు విజయవాడ లెనిన్‌సెంటర్‌లో నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశం నుంచి బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలని జాతీయ కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9న విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కార్మిక, కర్షక సంఘాల సమన్వయ సమితి నిర్ణయించింది. హనుమాన్‌పేటలోని దాసరిభవన్‌లో బుధవారం సమితి సమావేశం జరిగింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపిందని కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. యలమందరావు, పోలారి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ఇలా ప్రతి విషయంలోనూ బహుళ జాతి కంపెనీలు ప్రవేశించాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. బహుళజాతి కంపెనీలు వ్యవసాయ ఉత్పత్తిని పదిరెట్లు ధర పెంచి అదే రైతులకు విక్రయిస్తున్నారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండాపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు మాత్రం అనేక రాయితీలు, రుణాలు ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ అమలు చేయడం లేదని, విత్తన చట్టం తేలేదని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించలేదన్నారు. రైతుల డిమాండ్లను కేంద్రం గుర్తించలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే బహుళజాతి కంపెనీలను దేశం నుంచి తరిమివేయాలన్నారు. ఈనెల 9న జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు నాయకులు పి.ఆంజనేయులు, యు.వీరబాబు, మరీదు ప్రసాద్ బాబు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమకు అండగా నిలుద్దాం



చేనేత వస్త్రాలు ధరించిన విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ కళాశాలలో బుధవారం చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించటం ద్వారా చేనేత పరిశ్రమకు అండగా ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవం ప్రాముఖ్యతను, దేశ ఆర్థికాభివృద్ధిలో చేనేత వస్త్ర పరిశ్రమ ప్రాధాన్యతను వీడియో రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు చేనేత వస్త్రాలు ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు చేనేత వస్త్రాలు ధరించి ప్రదర్శించారు.

పాతబస్తీలో భారీ వర్షం



పాతబస్తీ సత్యనారాయణస్వామి దేవస్థానంలోకి వచ్చిన వర్షపునీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో భారీ వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి పాతబస్తీ పూర్తిగా జలమయమైంది. పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా నీటమునిగాయి. మూడు నాలుగు రోజులుగా ఎండ వేడికి అల్లాడుతున్న జనం రెండు రోజులుగా కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోవటంతో ఉదయం ప్రజలు తమతమ రోజువారీ విధులకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాతబస్తీలోని సుబ్బరామయ్యవీధి, కుమ్మరివీధి, డ్రెయిన్ వీధి, మహంతీపురం, వించిపేటలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇబ్బందులెదుర్కొన్న చిరువ్యాపారులు

ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం వర్షం ప్రారంభం కావటంతో చాలా మంది చిరు వ్యాపారులు తమ విధులకు సెలవు ప్రకటించారు. పాతబస్తీలోని వస్త్రలత, మొయిన్‌బజార్, సామారంగం చౌక్, శివాలయం వీధి, పూలబావి వీధి తదితర ప్రాంతాల్లో వర్షం కారణంగా మధ్యాహ్నం వరకూ దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. కృష్ణా విశ్వవిద్యాలయానికి సంబంధించి కొన్ని పరీక్షలు కొనసాగడంతో వర్షంలో ఆయా పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు.

గోదాదేవికి విశేష పూజలు



గోదాదేవికి పంచామృతాలతో అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం, పుబ్బ నక్షత్రం గోదాదేవి అమ్మవారు తులసీ వనంలో ఉద్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు వినుకొండ రామ రత్నమాచార్యులు గోదాదేవికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంరం తిరుప్పావై పాశురాలు, విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. అమ్మవారికి నిర్వహించిన విశేష అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ లింగపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్‌కాలనీలో

ఆరు బిల్డింగ్‌ల ప్రాంతం జలమయం



ఆరు బిల్డింగ్‌ల ముందు రోడ్డులో నిలిచిన వర్షపునీరు

మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా విద్యాధరపురం లేబర్‌కాలనీలోని ఆరు బిల్డింగ్‌ల ప్రాంతం నీటమునిగింది. వర్షపు నీటితోపాటు సైడు కాలువల్లో మురుగు ఉప్పొంగి రోడ్లు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి సైతం వర్షపు నీరు, మురుగు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఆరు బిల్డింగ్‌లకు పక్కనే ఉన్న జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు నీటమునగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షపునీరు ముందుకు కదలడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. పక్కనే కచ్చా డ్రెయిన్ ఉన్నప్పటికీ మురుగు నీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో అదికూడా మునిగిపోయింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం కార్మిక శాఖ నిర్మించిన జీ ప్లస్ త్రీ బిల్డింగ్‌లు (ఆరు బిల్డింగ్‌లు) శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలతో ఈ బిల్డింగ్‌ల్లో నివసిస్తున్నవారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ముందుగా డ్రెయిన్ల వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)



ఆరు బిల్డింగ్‌ల గ్రౌండ్ ఫ్లోర్‌లోకి చేరిన నీరు



ఇంటి గుమ్మం ముందు నిలిచిన వర్షపు నీరు



జీఎస్ఆర్ స్కూల్ ముందు నిలిచిన వర్షపు నీరు

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయపడిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారధిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మలతోటి గోపిచంద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను కళాశాలకు వెళ్లేందుకు బుధవారం ఉదయం మంగళగిరిలోని ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. 10.30 గంటలకు వారధిపై ఉన్న చెక్‌పోస్టు సమీపానికి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గోపిచంద్ కిందపడిపోవడంతో తలకు గాయమైంది. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

- నేడు వైద్య శిబిరం

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని గ్రంథాలయాధికారి కె.రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ట్రస్ట్ జాయింట్ సెంటర్, సంధ్య కంటి ఆస్పత్రి, మురారి దంత వైద్యశాల, అనిల్ న్యూరో వైద్యులు సేవలు అందిస్తారు.